# ఒకరోజు రాత్రి

రాత్రి బాగా ప్రొద్దుపోయింది. ఆకాశమంతా ఉరుములు మెరుపులు. ఏ క్షణానైనా, గాలీ వానా వచ్చేటట్టుంది. వానలో చిక్కుకుంటే యింటికి జేరడం అసంభవం. ఇంటికి వెళ్ళటంకోసం లేచి, నాగేశంతో "ఒరేయి చిల్లరడబ్బు లేమైనావుంటే యివ్వరా. ఈ గాలీ వానలో నడచిపోలేను" అని అన్నా. నాగేశం ఒక్క క్షణం ఏదో ఆలోచించి, పర్సులోంచి ఒక రూపాయి తీసి యిచ్చాడు.

"గొడుగు యివ్వనా?" అని అడిగాడు.

"వద్దురా రిక్షాలో వెళ్లుతా" అని అన్నా.

బయటకి వచ్చి చూస్తే అంతా చిమ్మ చీకటిగా వుంది. కనుచూపుమేరలో ఎక్కడా బండికాని రిక్షాకాని లేదు. చికాకు వేసింది. కాని ఏం చేస్తాం. నడక సాగించా... ఇక్కడ లేకపోతే వంతెన దాటితే ఏదో ఒక బండి దొరక్కపోదు! జేబులో వెండి రూపాయి బరువుగా తగిలింది. ఈ రెండు మైళ్లు నడిచివెళ్ళిపోతే రూపాయి మిగులుతుంది. కిళ్లీ కొట్లో మంచి సిగరెట్టు పెట్టి కొనుక్కోవచ్చు. రాజా మార్కు బీడీ కాల్చి ఎంతకాలమయింది. మనస్సు చికాకుగా వున్నప్పుడు, బీడీ కాలుస్తూ వుంటే ఎంత ఆనందంగా వుంటుంది. ఇవ్వాళ "గోల్డు ఫ్లేకు" పెట్టె కొంటా. పది తెల్లటి సిగరెట్లు- ఎంత హాయి...

వంతెన వచ్చింది. వంతెన మొదట్లో ఒక చిన్న దుకాణం వుంది. ఒక దీపపు సెమ్మీ, దాంట్లో వత్తి మినుకు మినుకు మంటుంది. దీపంచుట్టూ పురుగులు. పొయ్యిదగ్గర ముడుచుకొని కూర్చొన్న రెండు ఆకారాలు కన్పిస్తున్నాయి. పళ్లెంలో ప్రొద్దున్న వేసిన నూనె జిలేబీలున్నాయి. అది రామయ్య దుకాణం. ఎముకలు కొరకుతూవున్నా ఆయన తాపీగా కూర్చొని బీడీ కాలుస్తున్నాడు. అతని భార్య సాక్షాత్తు తాటకి అవతారం. పూరీలు తయారుచేస్తోంది. మోట చేతులతో, గాజులు దీపపు వెలుతురు మిలమిలా మెరుస్తున్నాయి. ఈ వెలుగు నీడలలో నలుగురు వ్యక్తులు భయం కొలుపుతున్నారు.

జీవితంలో మానవమాత్రుడికి చింతలనేకం వుంటాయి. ఈ యీదురు గాలిలో ఉరుములు మెరుపులతో యీ నలుగురి వ్యక్తులకి వున్న చింత ఒకటే. పైన కారుమబ్బులు. క్రింద కట్టలు త్రెంచుకోవడానికి పురవడులు త్రొక్కుతున్న నది. అంధకారంలో మునిగిన అనంతమైన బాటలో ఒంటరిగా నే నొక్కణ్ణి. నేను

అనేక విచిత్ర ఆలోచనలు అనుభూతిలో లీనమయ్యా. ఒక చల్లటి పిల్లగాలి నన్ను పులకితుడిని చేసింది. ఏదో స్వప్నలోకంలోని సుందరి తన సుకోమల బాహు పంజరంలో నన్ను బంధించి, నా వ్యధలని హరించినట్లనిపించింది. ఆ సుందరి స్వప్నలోకంనుంచి భూలోకంలోకి వచ్చి తన మందగమనంతో నా వెనువెంట నడుస్తూవుంటే ఎంత బాగుంటుంది? పిల్లగాలికి ఆ చిన్నదాని వలువలు కదుల్తూవుంటే, ఆ పుష్పగంధాన్ని ఆ సౌరభంలో నన్ను నేను మరిచిపోతే ఎంత బాగుండును?

నలుదిక్కులా నిశ్శబ్దం తాండవిస్తోంది. ప్రపంచంలోని ఉచ్ఛ నీచాలని, తనలో లయం చేసుకుని చీకటి ఎక్కడికో చూస్తోంది.

వంతెనమీద అక్కడక్కడ లాంతరుస్తంభాలున్నాయి. చెదురు చెదురుగా వాటి కాంతి నేలమీద పడుతోంది.

ఒక లాంతరుస్థంభం క్రింద ఒక కుర్రవాడు నుంచొని వున్నాడు. నేనేమో స్వప్నసుందరి గొడవలో పడి, అతని దగ్గరికి వచ్చేటప్పటికి, ఒక్కసారిగా వులిక్కిపడి అతనివంక చూశా. రెండు కన్నీటితోనిండిన కళ్లు నావంక చూస్తున్నాయి. నేను అక్కడే నిలబడిపోయా. ఎవరో యింకో లోకంలో వ్యక్తిలాగా కనిపిస్తున్నాడు. దయ్యమా?

కాని ఆ కళ్ళు!!

వాటిలో ఏ భావంవుందో నేనేం చెప్పను? నిర్జీవత్వం, శూన్యమూ ఆ కళ్ళల్లోంచి ప్రారంభమై ముఖమంతా ఆవరించాయి. రాతి విగ్రహానికి ప్రాణంతోవున్న రెండు నేత్రాలు అమర్చినట్లు భావశూన్యమైన ముఖం.

దయార్ద్రస్వరంతో నేను "ఎవరు నాయనా నువ్వు?" అని అడిగా. "ఎవరైతేనేం నీకేం!" అన్నట్టు నావంక చూశాడు.

"చెప్పు."

"ఏం చెప్పను" అని అన్నాడు. ఆ స్వరంలో నిస్పృహ, నిరాశా అడుగడుగునా వినిపిస్తున్నాయి.

"ఎవరునువ్వు? ఏం చెయ్యటానికి నిలబడ్డావు?"

వాడు నా రెండో ప్రశ్నకు సమాధానం చెప్పాడు. "నీళ్ళలోపడి చావటానికి.'

పిచ్చివాడేమోనని అనుకొని వాడివంక ధ్యానంగాచూసా... తిండీ తిప్పలులేని శరీరం ఎండి పీనుగైంది. ఎముకలు లెక్కపెట్టవచ్చు. వంటిమీద చిరిగిన నిక్కరుతప్ప ఏమీలేవు అంతే...

"నీళ్లలోపడి చస్తావా! మీ అమ్మ నాన్న ఎక్కడ?"

"అమ్మా! నాన్నా!" ఆ ముఖంలో చిరునవ్వు. దాంట్లో విషాదం, నిరాశా అన్నీ ఉన్నాయి.

"అమ్మ బండివాడితో లేచిపోయింది. నాన్న దొంగతనం చేస్తుంటే పోలీసులు పట్టుకొని జెయిల్లో వేశారు." ఈ మాటలు నాకు చెంప పెట్టులాగా తగిలాయి.

నేనేం చెప్పలేక నిశ్శబ్దంగా నుంచున్నాను. ఈచిన్నవాడి ముఖంచూస్తే, ఈ ప్రపంచంలో దేనిమీద ఆశలేనివాడిలాగా కనబడ్డాడు. పది పన్నెండు సంవత్సరాల వయస్సులోనే యీ నిరాశ ఏమిటి? ఈ చిన్న వయసులోనె జీవితంలో చాలా దుఃఖాన్ని చూసాడు. తన గోడు ఎవరితోనైనా చెప్పుకుందామని అనుకుంటున్నాడు. అందుకని "మూడురోజులనుంచి ఏం తినలేదు. తిని పారేసిన ఎంగిళ్ళు కూడా ఏం దొరకలేదు! నీళ్లలోపడి చచ్చిపోవాలని అనుకున్నా. అక్కయ్య ఉండేది. బిచ్చమెత్తి ఏమన్నా తెచ్చి పెట్టేది. లారీక్రిందపడి చచ్చిపోయింది. ఏమన్నా తీసుకొస్తుందేమో తిందామని ఎదురుచూస్తూ కూర్చున్నా... "మీ అక్కయ్య చచ్చి పోయిందని" వీరయ్య చెప్పాడు.

హృదయం ముక్కలు ముక్కలై అతని కంఠంలోంచి వినిపిస్తోంది. ఒక దీర్ఘ నిశ్వాసం హృదయంలోంచి వెలువడింది.

"అక్కయ్యకూడా చచ్చిపోయింది. ఒకచోట పని దొరికింది. కొన్ని రోజులు పనిచేశా. అయ్యగారు వచ్చి, 'వీడి అమ్మనాన్న మంచివాళ్ళుకారు. వీడుకూడా పిల్లల్ని చెడగొడతాడు' అని ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. జీతంకూడా యివ్వలేదు...' ' అని నావంక చూశాడు. (నా తెల్లబట్టలుచూస్తూ నన్ను, నా సంఘాన్ని అందరిని హేళన చేస్తున్నట్లు చూశాడు.)

"నలుగురిలో తిరగాలి గనుక యిటువంటి బట్టలు వేసుకుంటున్నాను. నేను నీకంటె ఏం గొప్పవాడినికాదు. ఉద్యోగం సద్యోగం ఏమీలేవు. ఒక్కొక్కరోజు ఏమీలేక వుపవాసం చేస్తున్నాను. కాని నీళ్లలోపడి చనిపోదామని మాత్రం ఎప్పుడు అనుకోవటంలేదు" అని అందామని అనుకున్నా. కాని నోటివెంట మాటరాలేదు. అతని కళ్ళవంక చూస్తూ నుంచున్నా. నిశ్శబ్దంగా జేబులోంచి రూపాయితీసి ఆ కుర్రవాడి చేతిలో పెడుతూ "రేపు వుదయం నాదగ్గరకు రా. ఎక్కడైనా ఉద్యోగం యిప్పిస్తా" అని నా ఎడ్రసు చెప్పి ముందుకు నడిచా.

ఆ కుర్రవాడు వస్తానని రానని చెప్పకపూర్వమే నేను ముందరికి నడిచా. తనచేతిలోని రూపాయి అది తనది అనే విశ్వాసం ఆ కుర్రవాడికి యింకా కలుగలేదు. ఆశ్చర్యంతో దానివంక చూస్తున్నాడు.

రెండడుగులు వెయ్యగానే నాకు సిగరెట్టు విషయం గుర్తుకువచ్చింది. ఆ కుర్రవాడు ఏం చేస్తూ వుంటాడో అనే విషయం ఆలోచించ మొదలుపెట్టాను. బహుశః వంతెనమీద దుకాణంలో కూర్చుని కడుపునిండా కావలసినన్ని తింటాడు. చలిమంటదగ్గర వెచ్చగా కూర్చొని వుంటాడు. బహుశః మానవులమీద మళ్ళీ కొంచెం విశ్వాసం ఏర్పడుతూ వుండవచ్చు.

దైవవశాత్తు యిల్లుచేరిన తరువాతనే వర్షం ప్రారంభమయింది. శరీరమంతా అలసిపోయింది. గది తలుపులు తెరిస్తే ఎప్పటిలాగే నిరాశా, దారిద్ర్యం తాండవమాడుతున్నాయి. వాడికి రూపాయి యిచ్చినందుకు పశ్చాత్తాపము కలగ సాగింది. ఉపవాసము, పైగా విపరీతమైన అలసట, దాంతో మనసుని మిగతాబాధలు కలవరపెట్టడం మొదలుపెట్టాయి. బ్రిడ్జిమీద లాంతరు స్తంభముక్రింద నుంచున్న కుర్రవాడినిగురించి రాత్రంతా ఒకటే కలలు.

రెండు మూడురోజులు గడిచాయి. ఆ కుర్రవాడు నాదగ్గరకు రాలేదు. ఓ రోజున నాగేశం దగ్గరకు వెడుతూవుంటే, ఆ వంతెనదగ్గర దుకాణం చూడగానే యీ విషయమంతా స్మరణకి వచ్చింది. చాలామంది పల్లెటూరివాళ్లు ఎడ్లబళ్ళు ఆపుకొని యీగలు ముసురుతున్న జిలేబీలు తింటున్నారు. ఆ కుర్రవాడిని గురించి తెలుసుకుందామనే ఉత్సాహం నన్ను ముందుకు నెట్టింది. ఆ దుకాణంవాడితో "చూడు మొన్న యిక్కడో కుర్రవాడుండాలి. వాళ్ల నాన్నని జెయిల్లో కూడా వేశారు...' అని అడిగా.

"బాంకో సంగతా మీరడుగుతుంది" అని కుతూహలంతో నావంక చూసి, మళ్లీ ఒక నిట్టూర్పు విడిచాడు. "వాడు నదిలో పడి చచ్చిపోయాడు."

"హు!" నేను నిశ్చేష్టుడనయ్యాను.

"చాలా దురదృష్టవంతుడు. అమ్మ ఎవడితోనో లేచిపోయింది. అక్కయ్య చచ్చిపోయింది. నేను కొన్ని రోజులదాకా కొంత తిండి పెడుతూ వచ్చాను. ఎంతకాలమని పెట్టగలం. మా పిల్లలే చాలీ చాలకుండా తిని పస్తులతో కాలం గడపవలసి వస్తుంది... ఈ కాలంలో ఈ వెధవకు కూడా...."

"నదిలో ఎల్లా పడ్డాడు?"

"వంతెనమీదనుంచి నీళ్లల్లోకి దూకాడు. అర్ధరాత్రి నది వరదలో వుంది. వాడిని రక్షించాలంటే ఎవడికి శక్యం? నదిలో పడటానికి ఎంత ధైర్యం వుందో వాడికి?"

"కాని వాడి దగ్గర రూపాయి వుండాలిగా?" అని నేను వ్యాకులంతో అడిగాను.

ఉంది బాబు... పరుగెత్తుకుంటూవచ్చి మా ఆవిడతో "మూడు రోజులనుంచి ఏమీ తినడం లేదు. ఇవ్వాళ కడుపునిండా తింటా. పూరీలు, జీలేబీలు యియ్యి" అని అన్నాడు. "డబ్బుందా లేకపోతె వూరికె యిమ్మంటున్నావా" అని మా ఆవిడ అడిగింది. వెంటనె రూపాయితీసి యిచ్చాడు. అది చూసేసరికి నవ్వులాటకి మా ఆవిడ "జేబులు కొట్టేవాడి కొడుకైనా, జేబులు కొట్టడం చాతకాలేదే' ' అని అంది. దాంతో వాడు పిచ్చివాడై ఎదురుగానె వంతెనమీదనుంచి నీళ్లలోకి గెంతాడు."

"మరి ఆ రూపాయి?"

"అది పూటా రూపాయి."

– *ఒక హిందీ కథ అధారం*